బీఆర్ఎస్ జిల్లా నేతలకు
కేసీఆర్ ఫోన్

లోక్‌సభ ఎన్నికలపై మంతనాలు

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పలువురు పార్టీ జిల్లా నాయకులతో ఫోన్‌లో మాట్లాడారు. మంగళవారం వరంగల్, కరీంనగర్‌సహా పలు జిల్లాల ముఖ్య నేతలతో మాట్లాడినట్టు సమాచారం. ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో ఉన్న కేసీఆర్‌ను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ పలువురు పార్టీ నాయకులతో ఫోన్‌లో మాట్లాడినట్టుగా తెలిసింది. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, అభ్యర్థులు ఎవరైతే బాగుంటుంది? లోక్‌సభ నియోజకవర్గాల సన్నాహక సమావేశాల్లో పార్టీ క్యాడర్ స్పందన, అధికార పార్టీ కార్యకలాపాలు తదితర అంశాలపై చర్చించినట్టు సమాచారం. ఆయా జిల్లాల నాయకులు పలు సూచనలు, సలహాలు ఇవ్వడంతోపాటు అభ్యర్థుల పేర్లను ప్రతిపాదించినట్టు తెలిసింది. అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా నిర్వహించే సమావేశాల తేదీలు, ఆ సమావేశాలకు పంపించాల్సిన పార్టీ ముఖ్య నేతల జాబితాపై చర్చించినట్టు తెలిసింది.

కేంద్రం కోత.. రాష్ట్రం వంత

మొదటిపేజీ తరువాయి...

వినియోగం పెంచేందుకు తీసుకుంటున్న చర్యలేంటో తెలియజేయాలని ఆదేశించింది. ఈ మేరకు మంగళవారం కేంద్రం అన్ని రాష్ట్రాలతో సమీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగా ఏయే రాష్ట్రం ఎంతమేర రసాయన ఎరువుల వినియోగం తగ్గించిందో, ఇకపై ఎంత తగ్గిస్తారనే అంశాలను తెలుసుకున్నది. రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 'పీఎం-ప్రణామ్' పథకాన్ని అమలు చేస్తున్నది. ఈ పథకం అమలుపై సమీక్ష నిర్వహించింది. కేంద్రం ఆదేశాలతో రాష్ట్ర వ్యవసాయశాఖ రసాయన ఎరువుల వినియోగం తగ్గింపుపై చర్యలు చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిసింది. పచ్చిరొట్ట, కంపోస్ట్ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని భావిస్తున్నది.

సబ్సిడీ భారం తగ్గించుకునేందుకేనా?

పీఎం ప్రణామ్‌పై ఇప్పటికే అనేక విమర్శలున్నాయి. ఏటా పెరుగుతున్న ఎరువుల సబ్సిడీ భారాన్ని తగ్గించుకునేందుకు కేంద్రం ఈ పథకాన్ని అమలు చేస్తున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచి రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలనే సాకుతో ఎరువుల పంపిణీలో కోత పెట్టేందుకు ప్రయత్నిస్తున్నది. దేశవ్యాప్తంగా సాగు పెరుగుతుండటంతో రసాయన ఎరువుల వినియోగం కూడా పెరుగుతున్నది. దీంతో కేంద్రంపై ఎరువుల సబ్సిడీ భారం భారీగా పెరుగుతున్నది. గత ఏడాది ఎరువుల సబ్సిడీ కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 1.05 లక్షల కోట్లు కేటాయించగా, రూ. 2.25 లక్షల కోట్ల సబ్సిడీ ఇవ్వాల్సి వచ్చింది. ఈ ఆర్థిక భారాన్ని తగ్గించుకునే ప్రయత్నంలో భాగంగానే పీఎం ప్రణామ్‌ను తెరపైకి తీసుకొచ్చిందనే వాదనలు ఉన్నాయి.

ఎరువుల పంపిణీలో కోత?

పీఎం ప్రణామ్ పథకం అమలు ద్వారా క్రమంగా ఎరువుల పంపిణీలో కోత పెట్టేందుకు కేంద్రం కుట్రలు చేస్తున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు పరోక్షంగా సంకేతాలిచ్చింది. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించే రాష్ట్రాలకు తగ్గించిన ఎరువుల సబ్సిడీ మొత్తాన్ని ఇతర అవసరాల కోసం కేటాయిస్తామని ఆశ చూపింది. పీఎం ప్రణామ్ పథకం తెలంగాణ వ్యవసాయరంగంపై, రైతులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నదనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మిగిలిన రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణలో ఎరువుల వినియోగం కాస్త ఎక్కువగానే ఉంటుంది. దీనికి తోడు కేసీఆర్ ప్రభుత్వ వ్యవసాయ సంక్షేమ చర్యలతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం, పంటల ఉత్పత్తి భారీగా పెరిగింది. ఇందుకు అనుగుణంగానే యూరియాతోపాటు ఇతర ఎరువుల వినియోగం కూడా పెరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పుడు సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచి రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలనే కేంద్ర నిర్ణయం రాష్ట్ర వ్యవసాయ రంగానికి అశనిపాతంగా మారుతుందనే రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

యూరియా పరేషాన్

మొదటిపేజీ తరువాయి...

రైతులు తమ అవసరం మేరకు యూరియా బస్తాలు అందకపోవడంతో వెనుదిరిగారు. జిల్లా స్థాయి గోదాముల్లో సమృద్ధిగా నిల్వలు ఉన్నప్పటికీ డిమాండ్‌కు తగ్గ సప్లై లేక ప్రైవేట్ డీలర్లను ఆశ్రయిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న ప్రైవేట్ డీలర్లు.. జింక్ బస్తా లేదా ఘంట గోలీలు కొంటేనే యూరియా ఇస్తామని షరతులు పెడుతున్నారు. యూరియా కొరత ఉన్న విషయమై 'నమస్తే తెలంగాణ' జగిత్యాల జిల్లా ఉన్నతాధికారులను సంప్రదించగా వెంటనే జిల్లా వ్యవసాయాధికారి, మార్క్‌ఫెడ్ డీఎం, డీసీవో, జిల్లా సహకార అధికారి, తహసీల్దార్ నూకపల్లి వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. సహకార సంఘం పరిధిలో యూరియా కొరత లేకుండా తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

లోకం పోకడ

మార్పుతెస్తాం.. మార్పుతెస్తాం అంటే ఇలా పాత పథకాల పేర్లు మారుస్తారనుకోలేదు!

బీఆర్ఎస్ ఆఫీస్ స్థలం ఆక్రమణ

గతంలోనే కేటాయించిన సర్కారు

కరీమాబాద్, జనవరి 23: వరంగల్‌లోని పుల్లాయకుంటలో నిరుడు బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం కోసం కేటాయించిన స్థలాన్ని కొందరు ఆక్రమించారు. 140, 142 సర్వే నంబర్లలో నిరుడు కార్యాలయం కోసం భూమి పూజ సైతం నిర్వహించారు. ఆ స్థలంలో కొందరు వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేపట్టారని సామాజిక కార్యకర్త ఫసీ, చెరుపుల రక్షణ కమిటీ ప్రతినిధి పెరుమాండ్ల లక్ష్మణ్ ఆరోపించారు. మంగళవారం రంగశాయిపేటలోని స్థలాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారులు విచారణ చేపట్టి స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని సూచించారు. స్థలం ఆక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, పార్టీ కార్యాలయం నిర్మించకపోతే ఆ స్థలాన్ని ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగించాలని కోరారు.

కేటీఆర్ సార్.. మీ సాయం మరువం

- **కృతిక చాలా సేఫ్‌గా ఉంది : నెటిజన్ హరీశ్ కృతజ్ఞతలు**
- **కృతిక ఆరోగ్యం మెరుగైనందుకు సంతోషం : కేటీఆర్**
- **వీధికుక్కల దాడిలో గాయపడ్డ చిన్నారికి కేటీఆర్ వైద్యసాయం**



హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): ఇటీవల వీధికుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన చిన్నారి కృతిక ఆరోగ్యం మెరుగైంది. ఆమె తండ్రి సంతు, ఆ ఇంటి యజమాని హరీశ్ చిడుగు.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఎక్స్ (ట్విటర్) ద్వారా కృతజ్ఞతలు తెలిపారు. 'హలో కేటీఆర్ సార్.. కృతికకు సాయం చేసేందుకు మీరు చూపిన అసాధారణ ప్రయత్నానికి హృదయపూర్వక కృతజ్ఞతలు. చిన్నారి కృతిక ఇప్పుడు సుక్షితంగా ఉన్నది. పెను ప్రమాదం నుంచి బయటపడింది' అంటూ కేటీఆర్‌ను ట్యాగ్ చేశారు. ఇందుకు కేటీఆర్ స్పందిస్తూ.. 'బిడ్డ క్షేమంగా, ఆరోగ్యంగా ఉన్నందుకు సంతోషం' అంటూ రీట్వీట్ చేశారు. ఈ నెల 17న హబ్సిగూడ పరిధిలోని రాంరెడ్డినగర్‌లో ఇంటివద్ద చిన్నారులతో ఆడుకుంటున్న కృతికపై వీధికుక్కలు దాడి చేశాయి. పాప ఎడమవైపు దవడ, చెవి, నోటి భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. సంతు దగ్గర వైద్యానికి డబ్బులు లేకపోవడంతో ఇంటి యజమాని హరీశ్ చిడుగు ఎక్స్ వేదికగా కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన కేటీఆర్.. తన టీమ్ అన్నీ చూసుకుంటుందని, బాధపడొద్దని ధైర్యం చెప్పారు.

రైతుబంధు రాలేదన్నోళ్లను
చెప్పుతో కొట్టండి

మొదటిపేజీ తరువాయి...

సమావేశంలో ఎన్నికల గ్యారెంటీల అమలుపై కమిటీ చర్చించింది. ఈ సందర్భంగా మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడారు. ముందు ప్రకటించినట్టుగానే 100 రోజుల్లో అన్ని గ్యారెంటీలను అమలు చేస్తామని తెలిపారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యబీమాను రూ.10 లక్షలకు పెంచామని చెప్పారు. మిగతా వాటిని 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఎన్నికల హామీలను నిర్దిష్ట గడువుకు ముందే అమలు చేయడం లేదని విమర్శించడం తొందరపాటు చర్య అన్నారు. లోక్‌సభ ఎన్నికల కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో తెలంగాణకు సంబంధించి రెండు అంశాలను చేర్చాలని సిఫారసులు అందినట్టు ఏఐసీసీ ఎన్నికల మ్యానిఫెస్టో కమిటీ సభ్యుడు ప్రవీణ్‌చక్రవర్తి మీడియాకు తెలిపారు.

మేడిగడ్డపై ఎఫ్ఐఆర్

- **కాళేశ్వరంపై ప్రభుత్వ కక్షసాధింపు**
- **ప్రాజెక్టు ప్రతిష్ఠను దెబ్బతీసేలా ప్లాన్**
- **సాగునీళ్లు ఇస్తలేరన్న అప్రతిష్ఠను తుడుచుకొనే ప్రయత్నం**
- **త్వరలో ప్రభుత్వానికి విజిలెన్స్ నివేదిక**

హైదరాబాద్, జనవరి 23 (నమస్తే తెలంగాణ): ఆది నుంచి కాళేశ్వరంపై అక్కసు వెళ్లగక్కుతున్న కాంగ్రెస్ పార్టీ... ఇప్పుడు అధికారం దక్కడంతో ఆ ప్రాజెక్టును అడ్డుపెట్టుకొని గత ప్రభుత్వంపై కక్ష సాధింపు చర్యలకు దిగే ప్రయత్నాలు చేస్తున్నది. కాళేశ్వరంలో పుష్కలంగా నీళ్లున్నప్పటికీ రైతులకు ప్రభుత్వం సాగునీళ్లు ఇవ్వడంలో విఫలమవుతున్నదనే ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో విమర్శల నుంచి తప్పించుకునేందుకు గత ప్రభుత్వంపై ప్రతీకార చర్యలకు ఒడిగడుతున్నట్టు తెలిసింది. ఇందులో భాగంగా మేడిగడ్డలో అనుకోనివిధంగా జరిగిన ప్రమాదాన్ని బూచిగా చూపుతూ మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టు ప్రతిష్ఠనే దెబ్బతీసేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్టు సమాచారం. కాళేశ్వరంపై విజిలెన్స్ తనిఖీల పేరుతో కొన్ని రోజులుగా హంగామా సృష్టించిన విషయం తెలిసిందే. ఈ విజిలెన్స్ నివేదికను త్వరలోనే ప్రభుత్వానికి అందించనున్నట్టు ఓ పోలీస్ ఉన్నతాధికారి తెలిపారు. నివేదిక ఆధారంగా త్వరలోనే మేడిగడ్డపై ఎఫ్ఐఆర్ నమోదు చేసే అవకాశం ఉన్నదని సదరు అధికారి వెల్లడించారు. అయితే నివేదిక ప్రభుత్వానికి అందకముందే తన అనుకూల మీడియాకు లీకులిస్తూ.. కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం డ్యామేజీ అయినట్టు ప్రచార మోదలుపెట్టింది. తద్వారా ప్రాజెక్టుపై, గత ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేక భావన కల్పించేందుకు ప్రయత్నిస్తున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
రంగారెడ్డి	16.6°c	34.5°c
ఆదిలాబాద్	17.1°c	34.8°c
మెదక్	18.7°c	33.6°c
వరంగల్	19.0°c	31.0°c
ఖమ్మం	20.0°c	30.0°c
నల్లగొండ	20.0°c	34.5°c
మహబూబ్‌నగర్	20.9°c	31.4°c
హైదరాబాద్	20.3°c	31.3°c
నిజామాబాద్	21.6°c	31.6°c
కరీంనగర్	22.0°c	32.0°c

మున్సిపల్ ఆఫీస్ గుమ్మానికి
చనిపోయిన కోడి

- **కుక్కల దాడిలో నాటు కోడి మృతి!**
- **కొత్తపల్లిలో యజమాని నిరసన**
- **సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని ఆగ్రహం**

కొత్తపల్లి, జనవరి 23: కుక్కల దాడిలో కోడి చనిపోవడంతో దాన్ని మున్సిపల్ కమిషనర్ ఆఫీసు గుమ్మానికి వేలాడదీసి నిరసన వ్యక్తం చేశాడో వ్యక్తి. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి పట్టణానికి చెందిన యువకుడు అజీజొద్దీన్ తన ఇంట్లోని కోడిని వీధి కుక్కలు చంపేశాయని, మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని వాపోతూ కోడి కళేబరంతో మున్సిపల్ కార్యాలయానికి వెళ్లారు. గమనించిన కమిషనర్ వేణుమాధవ్, అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో అజీజొద్దీన్ చేసేదేమీలేక కోడిని కమిషనర్ ఆఫీసు గుమ్మానికి వేలాడదీసి కొత్తపల్లి పట్టణ ప్రజల వాట్సాప్ గ్రూప్‌లో ఓ ఆడియోను విడుదల చేశారు. 'గత మూడున్నరేండ్లుగా కొత్తపల్లి మున్సిపాలిటీలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. కనీసం వీధి కుక్కల నుంచి ప్రజలను, కోళ్లను కాపాడాలని గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. సోమవారం నా ఇంట్లోకి కుక్కలు చొరబడి కోడిని చంపేశాయి. ఒక వేళ పిల్లలపై దాడి చేస్తే పరిస్థితి ఎలా ఉండేది? మీరే ఆలోచించుకోవాలి' అంటూ ఆడియోలో పేర్కొన్నారు. ఆఫీసు గుమ్మానికి కోడిని వేలాడదీయడంపై కమిషనర్ వేణుమాధవ్ కరీంనగర్ సీపీతోపాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కుక్కల దాడిలోనే కోడి చనిపోయిందా? లేదా? అనే విషయమై విచారణ జరిపిస్తామని తెలిపారు.

సముద్రపు నాచుతో సంపద!

మొదటిపేజీ తరువాయి...

లీటర్ల నీటి సామర్థ్యంతో, 10 నీటితొట్లను సిద్ధం చేశాడు. వీటిలో సముద్రం నుంచి తెచ్చిన మదర్ కల్చర్ (ఘన పదార్థం) నీటిని ఈ ట్యాంకుల్లో నింపారు. ఆ ట్యాంకుల్లో 20 నుంచి 25 రోజుల్లోపు నాచు తయారవుతుంది. ఈ నాచు నీటిని మోటర్ ద్వారా పంపింగ్ చేసి హార్వెస్ట్ చేస్తారు. ఇక్కడ ఫిల్టర్ అయి పేస్ట్ రూపంలో సేమియాను తలపించేలా నాచు పదార్థం బయటకు వస్తుంది. దీన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షెడ్‌లోని ట్రేలపైన ఉంచి రెండు రోజులు ఆరబెడతారు. అది ఎండిన తర్వాత ఫాంలోనే మిషన్‌తో పొడి చేస్తారు. ఇలా తయారైన పొడిని స్పైరునిలా(ఆల్గే) పౌడర్‌గా మార్కెట్లోకి విడుదల చేస్తారు.

సముద్రపు నీటిని నింపిన మదర్‌కల్చర్ ట్యాంక్

8 క్వింటాళ్ల పౌడర్ ఉత్పత్తి

మదన్‌మోహన్‌రావు ఏర్పాటుచేసిన ఫాంలో ఇప్పటివరకు స్వచ్ఛమైన పద్ధతిలో 8 క్వింటాళ్ల ఆల్గే పౌడర్‌ను ఉత్పత్తి చేశారు. నాచు పదార్థం అభివృద్ధి కోసం సోడా కార్బ్, ఫాస్ఫరేట్ సల్ఫేట్‌ను ఉపయోగిస్తారు. క్రమంగా పదిరోజుల్లోపు ట్యాంకుల్లోని నీళ్ల రంగు ఆకుపచ్చ, నీలం రంగులోకి మారుతాయి. 50 కేజీల సోడా కార్బ్ బస్తా నాలుగు రోజుల వరకు ఉపయోగపడుతుంది. ఈ ట్యాంకుల్లో ప్రత్యేకంగా మైక్రోస్కోప్ ద్వారా చూస్తేనే స్పైరల్స్ కనిపిస్తాయి. ఈ నాచు ద్వారా తయారైన పొడికి మార్కెట్‌లో కిలో వెయ్యి చొప్పున ధర పలుతుకుంది.

పోషకాల పౌడర్

ఈ ఆల్గే పౌడర్‌లో అనేక పోషక విలువలుంటాయని మదన్‌మోహన్ తెలిపారు. ఏ మాంసంలోనూ లేనన్ని ప్రొటీన్స్, అనేక మాంసకృత్తులు ఉన్నట్టు అమెరికన్ అగ్రికల్చర్ అధికారులు గుర్తించారు. 100 గ్రాముల ఆల్గే పౌడర్‌లో 57 శాతం మాంసకృత్తులు ఉంటే, ఇంకా కార్బోహైడ్రేట్స్ 24 శాతం, ఫ్యాట్ 8 శాతం, ఐరన్ 29 శాతం ఉన్నట్టు సైంటిస్టులు చెబుతున్నారు. ఈ పౌడర్ మనిషి శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థకు తిరుగులేని ఔషధంగా పనిచేస్తుంది. నీటిలో కలుపుకొని తాగవచ్చని తెలిపారు.

ప్రతి నెలా పది లక్షల పౌడర్ ఉత్పత్తి లక్ష్యం

మా ఫాంలో ప్రతినెలా రూ.10 లక్షల విలువైన ఆల్గే పౌడర్‌ను ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యం. ట్యాంకుల్లో ఇప్పటివరకు నాలుగింటిలోనే పని మొదలుపెట్టాం. ప్రస్తుతం కంటికి కనిపించని రీతిలో చిన్నపాటి సూక్ష్మక్రిములు రావడంతో ట్యాంకులను ఆరబెట్టాం. లోపాలను అధిగమించి ఒకేసారి 8 ట్యాంకులను సిద్ధం చేసి అనుకున్న మేర లక్ష్యం సాధిస్తాను. ఫాం ఏర్పాటుకు దాదాపు రూ.50 లక్షల వరకు ఖర్చు అయ్యింది. ఫాం అంతా ప్రొఫెషనల్‌గా ఏర్పాటు చేశాం. అనుకున్నట్లు సజావుగా జరిగితే ఫౌడర్‌తో ఎన్నో లాభాలున్నాయి. కర్ణాటకలో ప్రభుత్వమే పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతోపాటు విద్యార్థులకు ఆల్గే పౌడర్ గుళికలను అందజేస్తున్నది. మెడిసిన్, ఆహార పదార్థాల తయారీలోనూ.. ఈ పౌడర్‌ను వినియోగిస్తారు. స్థానికంగానే కాకుండా విదేశాలకు విక్రయించాలనే లక్ష్యం ఉన్నది.

- మదన్‌మోహన్‌రావు

నిపుణ
విద్య, ఉద్యోగ సమాచారం

సైంటిస్టు పోస్టులు

హైదరాబాద్ బాలానగర్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 41
- **పోస్టులు:** సైంటిస్ట్/ఇంజినీర్ ఎస్‌సీ, నర్స్, మెడికల్ ఆఫీసర్, లైబ్రరీ అసిస్టెంట్
- **విభాగాలు:** అగ్రికల్చర్, ఫారెస్ట్రీ అండ్ ఎకాలజీ, జియోఇన్ఫర్మాటిక్స్, జియాలజీ, జియోఫిజిక్స్, సాయిల్ సైన్స్, అర్బన్ స్టడీస్, వాటర్ రిసోర్సెస్
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 12
- **వెబ్‌సైట్:** https://www.nrsc.gov.in

అసిస్టెంట్ మేనేజర్లు

ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 28
- **పోస్టులు:** అసిస్టెంట్ మేనేజర్/సివిల్
- **అర్హతలు:** కనీసం 75 శాతం మార్కులతో సివిల్ ఇంజినీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత. రెండేండ్ల అనుభవం ఉండాలి
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 9
- **వెబ్‌సైట్:** www.ircon.org

టీఎస్ఆర్‌టీసీలో..

తెలంగాణ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (టీఎస్ఆర్‌టీసీ)లో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- **మొత్తం ఖాళీలు:** 150
- **పోస్టులు:** నాన్ ఇంజినీరింగ్ స్ట్రీమ్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌షిప్
- **అర్హతలు:** బీకాం, బీఎస్సీ, బీఏ, బీబీఏ, బీసీఏ లేదా తత్సమాన డిగ్రీ ఉత్తీర్ణత. 2018 నుంచి 2023 మధ్య బ్యాచ్‌ల వారు అర్హులు
- **అప్రెంటిస్‌షిప్ పీరియడ్:** మూడేండ్లు
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఫిబ్రవరి 16
- **వెబ్‌సైట్:** https://www.tsrtc.telangana.gov.in

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- పాలిటీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, హిస్టరీ (గ్రూప్స్) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

31 నుంచి వన్ వెహికిల్-వన్ ఫాస్టాగ్

- **వాహనదారులు కేవైసీ చేసుకోవాలి**
- **లేకపోతే.. 31 తర్వాత అకౌంట్ బ్లాక్**
- **మార్చి నుంచి జీపీఎస్‌తో టోల్ వసూలు**
- **నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా**

జహీరాబాద్, జనవరి 23: 'వన్ వెహికిల్-వన్ ఫాస్టాగ్' విధానం అమలులో భాగంగా నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) వాహనదారులను సత్వరమే ఫాస్టాగ్‌కు కేవైసీ చేసుకోవాలని ఆదేశాలు జారీచేసింది. లేదంటే ఈ నెల 31 తర్వాత ఫాస్టాగ్‌లు చెల్లవని హెచ్చరించింది. టోల్‌గేట్ల వద్ద టోల్ వసూలును సులభతరం చేయడానికి కేవైసీ పూర్తిచేయని ఫాస్టాగ్‌లను నిలుపుదల చేయాలని నిర్ణయించినట్టు ఎన్‌హెచ్ఏఐ అధికారులు తెలిపారు. కేవైసీ చేసుకోని ఫాస్టాగ్‌లను సంబంధిత బ్యాంకులు బ్లాక్ చేస్తాయని చెప్పారు. వాహనదారులు ఇబ్బందులకు గురికాకుండా ఉండాలంటే వెంటనే ఫాస్టాగ్‌లకు కేవైసీ చేసుకోవాలని ఎన్‌హెచ్ఏఐ ప్రకటించింది. కేవైసీపై పూర్తి సమాచారం కోసం సమీపంలోని టోల్‌ప్లాజాలు లేదా- సంబంధిత బ్యాంకు కస్టమర్ కేర్ సెంటర్లను సంప్రదించాలని సూచించింది.

ఫాస్టాగ్ స్టిక్కర్ నిబంధనలు పాటించాల్సిందే

ఫాస్టాగ్‌ను వాహనానికి అమర్చే విషయంలో నిబంధనలను కూడా ఎన్‌హెచ్ఏఐ ప్రకటించింది. ఫాస్టాగ్ స్టిక్కర్‌ను వాహనం ముందుభాగంలో పెట్టాలని అధికారులు తెలిపారు. కొందరు వాహనదారులు ఒకే ఫాస్టాగ్‌ను ఇతర వాహనాలకు ఉపయోగిస్తున్నారని అన్నారు. ఒకే వాహనం ఫాస్టాగ్‌ను అనేక వాహనాలకు లింక్ చేస్తున్నారని తమ దృష్టికి వచ్చినట్టు ఎన్‌హెచ్ఏఐ పేర్కొంది.

జీపీఎస్ విధానం ద్వారా టోల్‌చార్జీలు

మార్చి నుంచి జీపీఎస్ విధానం ద్వారా టోల్‌చార్జీలు వసూలు చేస్తామని, జియో పొజిషనింగ్ సిస్టమ్ (జీపీఎస్) ఆధారిత వ్యవస్థను తీసుకొస్తున్నట్టు ఇటీవల కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. వచ్చే మార్చి నాటికి దేశవ్యాప్తంగా జీపీఎస్ ఆధారిత వ్యవస్థ అమలుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. జీపీఎస్‌తో హైవేపై ప్రయాణించిన దూరానికి మాత్రమే టోల్‌చార్జీలు కట్టాల్సి ఉంటుంది. జీపీఎస్ విధానం అందుబాటులోకి వస్తే టోల్‌గేట్ల వద్ద వాహనాలను ఆపాల్సిన పని లేకుండా ఆటోమేటిక్ నంబర్‌ప్లేట్ రీడర్లను ఏర్పాటు చేస్తామని కేంద్ర మంత్రి ప్రకటించారు. దేశంలో ఈ విధానం అమలు కోసం రెండు పైలట్ ప్రాజెక్టులు చేపట్టినట్టు ఎన్‌హెచ్ఏఐ అధికారులు తెలిపారు.

కేవైసీ ఎలా చెక్ చేసుకోవాలి

ఫాస్టాగ్ కేవైసీ స్టేటస్ తెలుసుకోవాలంటే మీ ఈ-మెయిల్‌కు, ఎస్ఎంఎస్ లేదా మీ బ్యాంకు యాప్‌లకు వచ్చిన నోటిఫికేషన్‌లను చెక్ చేసుకోవాలి. ఈ నోటిఫికేషన్‌లు మీ ఫాస్టాగ్ కేవైసీ పూర్తికాకపోతే మిమ్మల్ని హెచ్చరిస్తాయి. మీ మెయిల్, బ్యాంకు యాప్‌లకు ఫాస్టాగ్‌లకు సంబంధించిన ఎలాంటి నోటిఫికేషన్ రాలేదంటే మీ కేవైసీ పూర్తి అయ్యిందని తెలుసుకోవాలి. ఫాస్టాగ్‌కు కేవైసీ ఉందా లేదా అనే విషయం తెలుసుకునేందుకు https://fastag.ihmcl.com వెబ్‌సైట్‌ను సందర్శించి.. మీ వివరాలను నమోదు చేసి పోర్టల్‌లో లాగిన్ అవ్వాలి. అక్కడ మీకు ఫాస్టాగ్ కేవైసీ స్టేటస్ కనిపిస్తుంది. కేవైసీ ఇన్‌కంప్లీట్‌గా ఉంటే అక్కడ కేవైసీని అప్‌డేట్ చేసుకోవాలి. మీకు ఫాస్టాగ్ జారీచేసిన బ్యాంకును ఎంచుకుని అక్కడే ఫాస్టాగ్ కేవైసీ ప్రక్రియను నమోదు చేసుకోవాలి. అవసరమైన గుర్తింపు అడ్రస్ ప్రూఫ్, డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలి. పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోను అప్‌లోడ్ చేసుకోవాలి. వివరాలన్నీ పూర్తి చేసుకుని చెక్ చేసుకోవాలి. డిక్లరేషన్‌ను కన్ఫర్మ్ చేసి, తర్వాత అప్లికేషన్ సబ్మిట్ చేయాలి. అవసరమైన పత్రాలను సమర్పించిన తర్వాత కేవైసీ ధ్రువీకరణ పూర్తవుతుంది.

చిరుధాన్యాల వైపు 70% జనాభా

- **పెరుగుతున్న వినియోగం**
- **భారత్‌లోనే 80% పంట దిగుబడులు**
- **ఎన్ఐఎన్ అధ్యయనంలో వెల్లడి**



హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 23 (నమస్తే తెలంగాణ): అన్నం తింటే రక్తంలో చక్కెర.. గోధుమలతో చేసిన రొట్టెల్లో కార్బోహైడ్రేట్స్ ఎక్కువ.. ఇలా ఆహార పదార్థాల్లో పోషకాలపై జరుగుతున్న అధ్యయనాలు భోజనపు అలవాట్లను మారుస్తుండగా.. అందుకు అనుగుణంగా పంటల సాగులో కూడా మార్పులు వచ్చి సంప్రదాయక ఆహార పంటలకు మళ్లీ డిమాండ్ పెరగనుందని పోషకాహార నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో సాధారణ ఆహార పంటలుగా ఉన్న వరి, గోధుమల కంటే అధికంగా రానున్నకాలంలో చిరుధాన్యాలు ప్రధాన ఆహారంగా మారే అవకాశం ఉందని భావిస్తున్నారు. చిరుధాన్యాల్లో ఉండే పోషక విలువలతో 70 శాతం జనాభాకు అవే ప్రధాన ఆహార వనరుగా మారుతుందని జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) అధ్యయనంలో తేలింది.

మిల్లెట్ల వైపు 70శాతం మంది

భారతీయ